క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం


డాక్టర్ తలే రాజేష్

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

వెండి వడ్డానం బహూకరణ


ఈఓకు వెండి వడ్డానం అందిస్తున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక పోలిపల్లి పైడితల్లికి శ్రీకాకుళంకు చెందిన భక్తులు కాను శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు అరకిలో వెండి వడ్డానం బహూకరించారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని, ఈ వడ్డానాన్ని ఈవో బీవీ మాధవరావు, అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మలకు సోమవారం రాత్రి అందజేశారు.

తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలి

బొబ్బిలి: తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు ఎస్.గోపాలం, ఎ.సురేష్‌లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో ప్రజా చైతన్య యాత్ర మంగళవారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఈ యాత్ర చేపడుతున్నామని, ప్రస్తుతం ట్రూ అప్ చార్జీల పేరిట కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచేశారని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యుత్ చార్జీలు తగ్గించే చర్యలు చేపట్టాలని, అలాగే పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు అమలు చేయాలని కోరారు.

ఊరూరా మద్యం బెల్టుషాపులే..

బొబ్బిలి: మద్యం బెల్టుషాపులు నిర్వహించి ఇంటింటికీ మద్యం అమ్మిన వారి బెల్టు తీస్తామన్న సీఎం చంద్రబాబు.. ఊరూరా బెల్టుషాపులు నిర్వహిస్తుంటే ఏం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రతిచోటా ఉండే చిన్నచిన్న కిరాణా షాపులు, కిల్లీ దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, ఇది కాదా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమన్నారు. మద్యం వ్యాపారులే సిండికేట్‌గా ఏర్పడి నిత్యావసరాల కన్నా ఎక్కువగా మద్యం విక్రయాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలప్పుడు నాసిరకం మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని అప్పటి ప్రభుత్వంపై విరుచుకుపడిన మీరు.. ఇప్పుడే చేసిందేమిటని నిలదీశారు. మీరిస్తున్న మద్యం నాసిరకం కాదా అని ధ్వజమెత్తారు. తక్షణమే నాణ్యత లేని మద్యం అమ్మకాలు నిలిపివేయాలని, మద్యం బెల్టుషాపులు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా చిన్నమ్మ జాతర


అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తుల చింతలు తీర్చే చిన్నమ్మగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారి గద్దెకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూడు రోజుల పండగలో సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం చేయగా, మంగళవారం ఘటాల తిరువీధి చేపట్టారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమ సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి దంపతులు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ చింతల రామకృష్ణలు అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు.

పరాయి పంచన.. ఇంకెన్నాళ్లు?

- అద్దె భవనాల్లో రైతు సేవా కేంద్రం సేవలు
- నెలకు రూ.2 వేలు చొప్పున అద్దె చెల్లింపు
- పలుచోట్ల ప్రభుత్వ శిథిల భవనాల్లో కార్యాకలాపాలు
- మరికొన్ని చోట్ల సచివాలయాల్లోనే..
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు


పాగిరిలోని రెండు రైతు సేవా కేంద్రాలూ ఈ అద్దె భవనంలోనే..


సంతకవిటి పీఏసీఎస్ పాత భవనంలో నిర్వహిస్తున్న రైతు సేవా కేంద్రం

రాజాం: రైతు సేవా కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. రైతు సంక్షేమమే లక్ష్యంగా గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణకు పక్కా భవనాల కోసం ఒక్కో భవన నిర్మాణానికి రూ.24 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. చాలావరకు నిర్మాణాలు పూర్తి కాగా కొన్ని మాత్రమే వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఆ కేంద్రాల్లోనే సాగు సలహాలు, సూచనలతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను రైతులకు అందిస్తూ అండగా నిలిచింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలోని కూటమి సర్కారు మాత్రం రైతుల సంక్షేమం విస్మరించింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా పాలనలో కొత్తదనమేమీ కనిపించడం లేదు. గతంలోని రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకేలు) పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. ఇప్పటికీ అవి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటి నిర్వహణకు గతంలో చేసిన శాశ్వత భవన నిర్మాణాలకు (పూర్తయిన చోట) ప్రస్తుతం బిల్లులు చెల్లించకపోవడంతోనే ఆయా కేంద్రాల సేవలు పరాయిపంచన(అద్దె భవనాల్లో) నిర్వహించాల్సి వస్తోంది. నెలకు రూ.2 వేలు చొప్పున వ్యవసాయ శాఖ అద్దె చెల్లిస్తోంది. కొన్నిచోట్ల ప్రభుత్వ శిథిల భవనాలు, సచివాలయాల్లోనే రైతు సేవా కేంద్రాలు నిర్వహిస్తుండడంతో అటు ఉద్యోగులు.. ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే అప్పటి రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చారని, అన్నదాతకు అందివ్వాల్సిన సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా నమోదు కార్యక్రమాలు జరుగలేదు. రబీ సీజన్‌లో రాయితీపై విత్తనాలు పంపిణీ చేయలేదు. ఏది ఏమైనా ఆర్‌బీకే/ఆర్‌ఎస్‌కే వ్యవస్థ నిర్వహణ విషయంలో ప్రభుత్వం తీరుపై రైతులు మండిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే బాగుండేదని, ఇప్పుడంతా అస్తవ్యస్తంగా వ్యవస్థ ఉందని విమర్శిస్తున్నారు.

నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల నిర్వహణ వివరాలు..

మండలం	ఆర్ఎస్‌కేలు	సొంత భవనాలు	ఇతర భవనాలు	అద్దెలు
రాజాం	21	06	04	11
రేగిడి	25	04	11	09
వంగర	19	03	04	11
సంతకవిటి	24	06	08	10
మొత్తం	89	19	27	41

నియోజకవర్గంలో 41 చోట్ల అద్దెలు..

రాజాం నియోజకవర్గంలో మొత్తం 89 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 19 చోట్ల సొంత భవనాలు ఉన్నాయి. వీటిని గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ప్రారంభించింది. మరో 22 చోట్ల భవనాల నిర్మాణాలు పూర్తయి ఉన్నాయి. వీటికి ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు వీటిని వ్యవసాయ శాఖకు అప్పగించలేదు. వీటితో పాటు ఇంకా నిర్మాణంలో ఉన్న మరికొన్ని భవనాల పూర్తికి కూడా ప్రస్తుత చంద్రబాబు సర్కారు బిల్లులు విడుదల చేయడం లేదు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయా భవనాల కాంట్రాక్టర్లు వాటి నిర్మాణాలు అర్ధాంతరంగా వదిలేశారు. ప్రారంభించిన భవనాల్లో రైతు సేవా కేంద్రాలు నడుస్తుండగా, మరి కొన్నిచోట్ల గ్రామ సచివాలయ భవనాల్లోనూ, ఇంకొన్నిచోట్ల ప్రభుత్వ శిథిల భవనాలు, అద్దె భవనాల్లో రైతు సేవా కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రతినెలా గత ప్రభుత్వం రూ.2 వేలు అద్దె చెల్లించేది. ఇప్పటి కూటమి ప్రభుత్వం ఆ అద్దెను కూడా చెల్లించడం లేదు. దీంతో భవనాలు ఖాళీ చేయాలని భవన యజమానులు వ్యవసాయ శాఖపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని గ్రామాల్లో సిబ్బందే సొంత డబ్బులు చెల్లించి మరీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇదే విషయంపై రాజాం వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, నియోజకవర్గంలో ప్రస్తుతం ప్రారంభానికి 8కి పైగా రైతు సేవా కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కొత్త భవన నిర్మాణాల పూర్తిని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

అద్దె భవనంలోనే..

మా గ్రామంలో రెండు రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. రెండూ కూడా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. పక్కా భవనాలు నిర్మించినా అక్కడ సేవలు ప్రారంభం కాలేదు. ఇక్కడ అద్దె భవనాల్లో కూడా వ్యవసాయ పరికరాల వినియోగం సక్రమంగా లేదు. ప్రస్తుతం రైతుకు ఎటువంటి ప్రయోజనం లేదు.

– బూరాడ నారాయణరావు, రైతు, పాగిరి

శిథిల భవనంలోనే సేవలు..

మా గ్రామంలో పాత(శిథిల) పీఏసీఎస్ భవనంలోనే రైతు సేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. అక్కడ చాలా ఇరుకుగా ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి సేవలు సక్రమంగా అందడం లేదు. ఇటీవల ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో హడావిడి చేస్తున్నారు. రైతుకు మేలు చేసే ఏ ఒక్క కార్యక్రమం ఇప్పుడు జరగడం లేదు.

– జి.రాము, రైతు, బొద్దూరు, సంతకవిటి మండలం

ఎత్తిపోతల పథకం పనులు చేపట్టండి



తోటపల్లి ప్రధాన కుడికాలువపై లోచర్ల ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ నాయకుడు, మాజీ సైనికోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవర ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు తెర్లాం మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. లోచర్ల, ఆమిటి గ్రామాల మధ్య తోటపల్లి కుడికాలువపై ఎత్తిపోతల పథకాన్ని 2010లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు శిలాఫలకాలు ఆవిష్కరించడానికే ప్రాధాన్యమిచ్చారు గానీ పథకం పనులు చేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. లోచర్ల ఎత్తిపోతల పథకం నిర్మిస్తే ఆమిటి, లోచర్ల, కవిరాయునివలస, సీతారాంపురం, పనుకువలస, సోమిదవలస, వెలగవలస గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ నిర్మాణం కోసం ఆయా ప్రాంతాల రైతులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు కూడా లోచర్ల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. – తెర్లాం

పనిభారం తగ్గించాలని డిమాండ్



పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులంతా బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం వెళ్లి, ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం లేనిపోని సర్వేలతో తమపై పని ఒత్తిడి పెంచిందన్నారు. దీంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై, అనారోగ్యం పాలవుతున్నామని వాపోయారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, పంచాయితీ కార్యదర్శుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రఘు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు



రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పి.రవికుమార్ హెచ్చరించారు. బొబ్బిలి మండలంలోని మెట్టవలస గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన.. గ్రామంలోని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం ఉండడాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్తులు విచక్షణారహితంగా రోడ్లు, కాలువల్లో చెత్త వేయడం వల్లే పారిశుద్ధ్య లోపం ఏర్పడి, ప్రజలు రోగాల బారినపడాల్సిన దుస్థితి తలెత్తుతోందన్నారు. ఇప్పటికైనా బాధ్యతగా మెలగాలని, గ్రీన్‌అంబాసిడర్లకు చెత్త అందివ్వాలని కోరారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

సంక్షిప్తంగా..

20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

బాడంగి: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందాలనుకునే వారు ఈ నెల 20వ తేదీలోగా గ్రామ సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు బీసీ కులస్తులంతా దరఖాస్తు చేసుకోవచ్చని, క్షేత్రస్థాయిలో అర్హతల పరిశీలనానంతరం అర్హుల జాబితాను ఓబీఎంఎస్ పోర్టల్‌లో పొందుపరిచి ఆన్‌లైన్‌లో కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నామన్నారు. మండలానికి 71 రుణాలు ఇచ్చేందుకు మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. బ్యాంకుల వారీగా విభజించి, రుణాలు మంజూరు చేయనున్నామన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేష్, ఆప్తాలమిక్ అధికారి వసంతరావులు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ శిబిరానికి వివిధ కంటి సమస్యలతో బాధపడే వారంతా తనిఖీలు చేయించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే వారంతా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

మెంటాడ: మండలంలోని చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారిణి ఉషారాణి, ఇతర వైద్యులంతా వ్యాధి లక్షణాలు పరిశీలించి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

సకాలంలో స్త్రీనిధి రుణాలు చెల్లించండి

బొబ్బిలిరూరల్: బ్యాంకుల ద్వారా తీసుకున్న స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించాలని స్త్రీనిధి మేనేజర్ కె.రమేష్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలు, గ్రామైక్య సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశమై, స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాయిదాల పద్ధతిలో రుణాలు సమయానికి కట్టాలన్నారు.

నిబంధనలు తప్పనిసరి

సంతకవిటి: మద్యం దుకాణం ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ సూచించారు. తమ గ్రామంలో మద్యం షాపు వద్దని మండలంలోని పోతులజగ్గపేట గ్రామ మహిళలు సోమవారం షాపు ముందు నిరసనకు దిగడంతో స్పందించిన ఆయన.. మంగళవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. కొత్తగా ఏర్పాటు చేయాలనుకునే షాపు స్టేట్ హైవేకు ఆనుకుని ఉండడంతో అక్కడ షాపు ఏర్పాటు చేయకూడదని యజమానులను హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో విద్యుత్ సరఫరాలో మంగళవారం రాత్రి అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య కారణంగా రాత్రి 9:45 గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు కరెంట్ సరఫరా ఆగిపోయింది. దీంతో పట్టణంలోని సాయినగర్, మహారాణిపేట, పూల్‌బాగ్, నాయుడుకాలనీ, చినబజారు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత కరెంట్ సరఫరా పునరుద్ధరణ చేయడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మెంటాడ/బాడంగి: మెంటాడ మండలంలోని మీసాలపేట, బాడంగి మండలంలోని రామచంద్రాపురం, పిన్నవలస గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేశారు. ఏటా పశువులు గాలికుంటు, బ్రూసెల్లా వ్యాధుల బారినపడకుండా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం జోనల్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్

రామభద్రపురం: పంచాయతీ కార్యదర్శుల సంఘం జోనల్ సెక్రటరీగా మండలంలోని కొట్టక్కి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల జోన్(విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం) సెక్రటరీగా ఎంపికైనట్లు ఆయన మంగళవారం తెలిపారు.

‘యువత పోరు’ను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


రామభద్రపురం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి


రాజాం: యువత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామభద్రపురం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడులతో కలిసి ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్ మంగళవారం ఆవిష్కరించి, మాట్లాడారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని విద్యార్థులను, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం నమ్మించి, మోసం చేసిందని విమర్శించారు. ఆయా హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టే యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, యువత, నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాడంగి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విజయనగరం జిల్లా కేంద్రంలో బుధవారం చేపట్టే యువత పోరు కార్యక్రమానికి నిరుద్యోగులు, విద్యార్థులు, యువత తరలిరావాలని పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు కోరారు.

రాజాం: విజయనగరం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: విజయనగరంలో ఈ నెల 12వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే యువత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలో ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గ్రామదేవతలను దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తెర్లాం: మండలంలోని కొల్లివలస, గొలుగువలస గ్రామాల్లో జరుగుతున్న గ్రామ దేవతల పండగకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు మంగళవారం హాజరై, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్ర ప్రజలంతా బాగుండేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వులు రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు


కోర్టు ఉత్తర్వులు చూపిస్తూ మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెంటాడ: మండలంలోని పెద్దచామాలపల్లి సర్పంచ్ బాయి తవుడమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ కలెక్టర్ అంబేడ్కర్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రెడ్డి రాజప్పలనాయుడు తెలిపారు. ఇదే విషయమై ఆయన సర్పంచ్ తవుడమ్మతో కలిసి పెద్దచామాలపల్లి గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించి దుర్వినియోగం చేశారని సర్పంచ్‌పై కూటమి నాయకులు మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఫిర్యాదు చేసి, ఆ తర్వాత అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసేలా చేశారన్నారు. నిబంధనల ప్రకారమే పంచాయతీ నిధుల ఖర్చు జరిగినట్లు డీపీఎల్‌వో, డీపీవోతో పాటు ఆర్డీవో విచారణలో వెల్లడైనా కలెక్టర్ రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేసి కలెక్టర్ ఉత్తర్వులను రద్దు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కోర్టు ఉత్తర్వులతోనైనా కూటమి నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని, కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత బాయి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మెతుకు పోరాటం.. బతుకు ఆరాటం!


జాతరలో భావిభారత పౌరుడి పరిస్థితి..


మహాత్మాగాంధీ కలలుగన్న స్వరాజ్యంలో నేటి గాంధీ..


పొట్ట కూటి కోసం దివ్యాంగుని తిప్పలు..

‘కూటి కోసం కోటి విద్యలు’ అనేదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి.. ఈ చిత్రాలు.. జానెడు పొట్ట నింపుకునేందుకు తమ ప్రాణాన్నే పణంగా పెడుతున్నారు. వీక్షకులను మెప్పించి, వారిచ్చే రూపాయితో కడుపు నిండా అన్నం తినేందుకు వీరు పడుతున్న ఆరాటం ఓ బతుకు పోరాటమే.. రాజాం పోలిపల్లి పైడితల్లి జాతరలో ఇలా పలువురు చేసిన విన్యాసాలు చూపరులను అలరించాయి. – రాజాం


ప్రాణాలను పణంగా పెట్టి బాలిక సర్కస్ విన్యాసం..


భక్తుల దక్షిణ డబ్బుల కోసం ఇలా మోకాళ్లపై దేవుడి ఫొటోలతో..